# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 56 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 9 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

## 9 మంది మృతి, పలువురికి గాయాలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పెద్ద మొత్తంలో ఉక్కుద్రవం లీక్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో
ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ప్రమాదం

ప్రమాదంలో 9 మంది కార్మికులు మృతి

సంతాపం తెలిపిన ప్రముఖులు



**విశాఖ, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ఒక్కసారిగా పేలడంతో ఉక్కుద్రవం లీకైంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతిచెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్‌ను ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా సమాచారం. ప్రమాద ఘటనతో స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారమందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు.

మృతులు వీరే : ఈ ప్రమాదంలో అప్పారావు, కృష్ణ, ప్రభాకర్ రావు, అప్పలరాజు, త్రినాథ్, రమణ, కుమార్‌లు మృతిచెందినట్లుగా గుర్తించారు. మరో ఇద్దరికి సంబంధించిన ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కట్టి

# పేద ప్రజలకు ఇస్తాం



## సీఎం రేవంత్‌రెడ్డి

దేశంలోని ప్రధాన నగరాల్లో కాలుష్యం,
ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి

నివాస అనుకూల నగరం హైదరాబాద్

పాలనా సమన్వయం కోసమే జీహెచ్ఎంసీని
3 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశామన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

దేశంలో 6 పెద్ద (ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూర్, హైదరాబాద్) నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఢిల్లీలో వాతావరణం ఎలా ఉందో చూశామని, కాలుష్యం వల్ల ఢిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారని పేర్కొన్నారు. దేశంలోని అన్నీ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయన్న ఆయన హైదరాబాద్ మాత్రం నివాసానికి అనుకూల నగరమని కొనియాడారు. పెద్ద నగరాల్లో ఉన్న సమస్యలు ఇక్కడ లేకుండా చేసేందుకు నిపుణులతో కమిటీ వేశామని, పాలనా సమన్వయం కోసమే 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ కార్పొరేషన్‌లో ఐటీ కంపెనీలు ఉన్నాయని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం హైదరాబాద్ నుంచే సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు.

అంతకు ముందు రూ.1674.74 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ముందుగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, మియాపూర్‌లో ద్విముఖ పైవంతెన, 2 అండర్‌పాస్‌లు, మియాపూర్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు ఆరు వరుసల ద్విముఖ పైవంతెన, శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మియాపూర్ లక్ష్మీనగర్‌లో బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.

"తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తేనే మోదీ ప్రధానమంత్రి అయ్యారు. తెలంగాణ ప్రయోజనాలపై మీరు మోదీని అడగరా? మూసీనది ప్రక్షాళన కోసం అనుమతులు తీసుకురమ్మంటే అది చేతకాదు. కిషన్ రెడ్డి ప్రధానమంత్రి మోదీని అడగాలి. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టులో తుమ్మిడిహెట్టి నిర్మాణం చేయాలంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చిద్దామంటే అడ్డుపడుతున్నది మీరు కాదా? ఎందుకు అడ్డుకుంటున్నారు" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారు : ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయం మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి 8 మంది ..మిగతా 2లో

## కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు

# కేరాఫ్ అడ్రస్‌గా బొగ్గు

నవభారత నిర్మాణంలో
బొగ్గు రంగానిదే కీలక పాత్ర: కిషన్ రెడ్డి



రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని
కాగ్ బట్టబయలు చేసిందని వెల్లడి

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల
ఆదాయపు పన్ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వ్యాఖ్య

**హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో 'బొగ్గు' అంటే ..మిగతా 2లో

## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో

# చేప ప్రసాదం పంపిణీ షురూ

భారీగా తరలివచ్చిన ప్రజలు

పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనం

చేప మందు పంపిణీకి హాజరైన బత్తిని కుటుంబసభ్యులు



**హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

ఏటా మృగశిర కార్తె సందర్భంగా నిర్వహించే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రారంభమైంది. బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదాన్ని తీసుకుంటే ఉబ్బసం, అస్తమాతో ఇతర రోగాలు నయమవుతాయని ..మిగతా 2లో




# ఐక్యతతో పోరాటాన్ని కొనసాగించాలి

ఇండియా కూటమి మీటింగ్‌లో ఖర్గే

ఇండి కూటమి సమావేశం- ప్రారంభోన్యాసం

ఖర్గే కీలక వ్యాఖ్యలు... కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు

2




## అంగీకారంతో కూడిన శారీరక సంబంధం

# చెడు ప్రవర్తనకు సంకేతం కాదు

## సుప్రీంకోర్టు

2

పెళ్లి కాని ఇద్దరు వయోజనుల మధ్య సమ్మతితో ఉన్న శారీరక సంబంధం తప్పు కాదన్న సుప్రీంకోర్టు

విఫలమైన ప్రేమ వ్యవహారానికి సంబంధించిన కేసు ఆధారంగా ఉద్యోగ నియామకం రద్దు చేయడం సరికాదని వ్యాఖ్య

# కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా బొగ్గు

**మొదటి పేజీ తరువాయి...**

కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు.

గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని... ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు.

భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... ప్రభుత్వం



ప్రస్తుతం 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని.. ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు.

రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# ఐక్యతతో పోరాటాన్ని కొనసాగించాలి

**న్యూఢిల్లీ, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ నేతృత్వంలో ఢిల్లీ వేదికగా సోమవారం ప్రారంభమైన ఇండి కూటమి సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు హాజరయ్యారు. ఈ భేటీలో కేంద్రంపై పోరాటంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగాలని విపక్ష నేతలు నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన ప్రతిపక్ష నేతలు దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అందరూ కలిసి అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కూటమి ఛైర్మన్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రారంభో న్యాసం చేశారు. పార్లమెంటులో రాజ్యాంగ (131 సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులను ఓడించడంలో కూటమి కనబరిచిన ఐక్యతను ఖర్గే ప్రశంసించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను ప్రస్తావించారు. ూ×= పేరుతో లక్షలమంది ఓటు హక్కులను కాలరాస్తున్నారని, దర్యాప్తు సంస్థలను పావులుగా వాడుకుంటూ కేంద్రం బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష చూపిస్తోందని మండిపడ్డారు. పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, పరీక్షల వ్యవస్థ వైఫల్యం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు.

"ఇండియా బ్లాక్ నాయకుల ఈ సమావేశానికి మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాను. ఈ కూటమి మూడేళ్ల మూడేళ్ల కిందట ఏర్పడింది. మన ముందున్న సమస్యలు మీ అందరికీ బాగా తెలుసు. అందుకే కాబట్టి నేను ఎక్కువసేపు మాట్లాడదలచుకోలేదు. 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో మనమందరం ఏకమై, డీలిమిటేషన్‌పై మోదీ ప్రభుత్వ దురుద్దేశపూర్వక బిల్లులను ఓడించి, మన ఐక్యతను,సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించాము" అని అన్నారు.

**ఎజెండా ఏంటంటే?**

కూటమిలోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తడంతో ఈ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. అయితే సమావేశ ఎజెండా గురించి అడగ్గా విపక్ష నేతలను మీడియా అడగ్గా, దీనిపై కూటమి భాగస్వాములు సమష్టిగా నిర్ణయం తీసుకుంటాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. అయితే ఈ సమావేశంలో చర్చలకు సంబంధించిన మరిన్ని విషయాలను త్వరలోనే వెల్లడిస్తామని అఖిలేశ్ యాదవ్ చెప్పారు. మరోవైపు, చాలా రోజుల తర్వాత జరుగుతున్న ఈ సమావేశం ప్రతిపక్షాలకు ముఖ్యమైనదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. అయితే దీనికి సంబంధించి ప్రత్యేకమైన అజెండా ఏమీ లేదని తెలిపారు. 'బీజేపీ హటావో, దేశ్ బచావో' పిలుపుతో ప్రతిపక్ష కూటమి ఏర్పడిందని గుర్తుచేసిన ఆయన, ప్రజలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ భాగస్వామ్య పార్టీలు పరస్పర విశ్వాసం, గౌరవంతో ఎలా కలిసి పనిచేయగలవు? అనే దానిపై సమావేశంలో చర్చిస్తారని రాజా తెలిపారు.

**DMK దూరం కాకుండా చర్చలు**

ప్రతిపక్ష కూటమి సమావేశంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సోమవారం బారామతిలో మీడియాతో మాట్లాడారు. ఇండి కూటమికి డీఎంకే దూరంకానుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మిత్ర పక్షాల పార్టీల కీలక నాయకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇవాళ ఢిల్లీలో జరుగుతున్న సమావేశంలో కూటమిలోని సభ్యులు ఎలాంటి తీవ్రమైన నిర్ణయాలు లేదా చర్యలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి డీఎంకే దూరం కానుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న 8 -15 రోజుల్లో కూటమికి చెందిన కీలక నేతలతో సమావేశం నిర్వహించి, సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తామని పవార్ పేర్కొన్నారు. ఇలాంటి చర్చల వల్ల పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంగీకారంతో కూడిన శారీరక సంబంధం చెడు ప్రవర్తనకు సంకేతం కాదు

**న్యూఢిల్లీ, జూన్ 8 (విశాల తెలంగాణ):**

మేజర్ల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ నియామక మండలికి కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది.

**అసలు కేసు ఏంటంటే?**

కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది. అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**వివాహంతోనే ప్రేమ ముగియాలనే నియమం లేదు!**

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

**చట్టపరమైన పరిమితుల్లోనే!**

క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ఒక వ్యక్తిపై ఆరోపణలు నిరూపితమయ్యే వరకు అతడిని నిర్దోషిగానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఆరోపణలు ఉన్నాయనే కారణంతోనే అతడిని దోషిగా చూడలేమని తెలిపింది. ముఖ్యంగా మోసం జరిగిందా లేదా అనే విషయాన్ని సంబంధిత బాధితురాలు మాత్రమే వివరించగలదని పేర్కొంది. ఈ కేసులో యువతి స్వయంగా కేసును కొనసాగించేందుకు ఆసక్తి చూపకపోవడం, ఎలాంటి సాక్ష్యాలు సమర్పించకపోవడం, పైగా రాజీకి అంగీకరించడం వంటి అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది. అలాంటి పరిస్థితుల్లో నియామక అధికారులు తమంతట తామే ఊహాగానాలు చేసి అభ్యర్థి వ్యక్తిత్వంపై చెడు అభిప్రాయం ఏర్పరచుకోవడం సమంజసం కాదని స్పష్టం చేసింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి






**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక ముగింపులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,జూన్08(ప్రభాత ఉదయం)**

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం చొరవ చూపడం జరుగుతుందని,ఈ మేరకు ఎవరు ఎలాంటి సమస్యలు వివరించినా వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.ప్రజలు ఎలాంటి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చినా వాటి పరిష్కారానికి అన్ని విధాలా సహకరించడం జరుగుతుందని వివరించారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం, పాలమాకుల గ్రామ పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" (99రోజుల కార్యాచరణ కార్యక్రమం)ముగింపు దశ గ్రామ సభ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ప్రజా సమస్యలను ఎమ్మెల్యే నేరుగా అడిగి తెలుసుకున్నారు.ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన,పారిశుద్ధ్య మెరుగుదల,ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.గతంలో ఎన్నడూ జరుగని అభివృద్ధిని చేసినట్లు చెప్పారు.పాలమాకుల గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.ప్రజలు ఏ సమస్య వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత మీదేనని నాయకులను సూచించారు.



# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ ఉక్కు కర్మగాయం ఉద్యోగులు కాగా, ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు వివరించారు. మరోవైపు రావూరి మల్లికార్జునరావు, అర్జున అప్పారావు, సూరిబాబు, పల్లెల శ్రీనివాస్, సత్యనంద్, పైడిరాజులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం : విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు అందిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ షురూ

**హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం)**

ఏటా మృగశిర కార్తె సందర్భంగా నిర్వహించే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రారంభ మైంది. బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదాన్ని తీసుకుంటే ఉబ్బసం, అస్తమాతో ఇతర రోగాలు నయమవుతాయని ప్రజలు విశ్వసిస్తారు. చేప ప్రసాదం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి తరలివచ్చారు. నిర్వాహకులు ప్రసాదం పంపిణీ కోసం పలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పూజాకార్యక్రమం అనంతరం బత్తిని కుటుంబ సభ్యులు చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు.

35 కౌంటర్ల ద్వారా చేప ప్రసాదం పంపిణీ : గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో ఉంచుకుని ఈసారి 35 కౌంటర్లను ఏర్పాటు చేశారు. వర్షం వచ్చినట్లయితే సమస్యలు రాకుండా షెడ్లలో చేప ప్రసాదం పంపిణీ చేపట్టనున్నారు. ఇక్కడికి వచ్చే రద్దీకి తగినట్లుగా ఎక్కడా కొరత రాకుండా ఉండేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1,40,000 నాణ్యమైన కొర్రమీను చేప పిల్లలను ప్రత్యేక కౌంటర్‌ల వద్ద సిద్ధంగా ఉంచారు. వీటిని క్షేమంగా భక్తుల వరకు చేర్చేందుకు అధికారులు ప్రత్యేక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు ఒకేసారి తరలివచ్చే అవకాశం ఉండటంతో, ఎలాంటి తొక్కిసలాటలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కట్టి పేద ప్రజలకు ఇస్తాం

**మొదటి పేజీ తరువాయి...**



ఎంపీలను పంపిస్తేనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని అన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు గులాంలా ఎందుకు పనిచేస్తున్నారని ఆయన నిలదీశారు. ఇక్కడ ఉన్న ప్రజలు మీకు ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు.

రెండేళ్లలో ఏం చేయలేదని తనను అడుగుతున్నారని ముందు మీరేం చేశారో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు నీటి పారుదల ప్రాజెక్టు నిధులు రాకుండా అడ్డుపుల్ల పెట్టారని ధ్వజమెత్తారు. సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అంటున్న వీళ్లు మూసి ప్రక్షాళనకు సహకరించమని బీజేపీ ఎంపీలు అడగాలి కదా అని చెప్పారు.

నేను ఒప్పిస్తే ఆయన ఆపుతున్నారు : తాను ఢిల్లీకి వెళ్లిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి అన్ని పనులకు అడ్డుతగులుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీకి ఇద్దరం కలిసి వెళదాం అంటే కిషన్‌రెడ్డి రావట్లేదన్నారు. తాను మోదీని కలిసిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి కలుస్తున్నారని, తాను ఏ కేంద్రమంత్రిని కలిస్తే 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి కలుస్తున్నట్లు చెప్పారు. తాను వెళ్లి ప్రాజెక్టుల కోసం ప్రధానిని, కేంద్రమంత్రులను ఒప్పిస్తే, నిధులు, ప్రాజెక్టులు ఇస్తే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డి పేరు వస్తుందని కిషన్‌రెడ్డి కర్ర అడ్డం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పరోక్షంగా కేసీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 12 ఏళ్లుగా ప్రధాని మోదీ ఏం చేశారో రెండేళ్లు సీఎంగా తాను ఏం చేశానో చర్చకు సిద్ధమన్నారు. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. విశ్వనగరంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ నగరంలో లక్ష ఇళ్లు కట్టించి ప్రజలకు కేటాయిస్తామని, ఏ ప్రాంతం వారికి అక్కడే ఇల్లు కట్టించి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కబ్జా చేసిన ప్రభుత్వ భూములు గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లు చెల్లించామన్న ఆయన మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు కొనిచ్చినట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ మహాలక్ష్మి పథకం వల్లే లాభాల్లోకి వచ్చిందన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయి పాలకమండలి లేక ఇష్టానుసార పాలన

**యూనివర్సిటీ అధికారుల పోస్టుల ను కూడా జిల్లాలకు బదిలీ**

**గేట్లు మూయడంతో రాకపోకలకు ఇబ్బందులు**

**వర్శిటీ ఉన్నతాధికారుల నివాసాలలో తిష్టవేసిన పోలీస్ అధికారులను ఖాళీ చేయించలేని పరిస్థితి**

**రాజేంద్రనగర్, జూన్ 7 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు 21 మంది తో కూడిన పూర్తి పాలకమండలి ని ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలు, అద్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఉన్న పాలకమండలి గడువు ఏప్రిల్ నెలతో ముగిసింది. కొత్త పాలకమండలి లో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో పాటు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, భారత వ్యవసాయ పరిశోధన మండలి కి చెందిన అధికారులు, రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు అవకాశం కల్పిం చాలి. గత పాలకమండలి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో వర్శిటీ లో ఇష్టానుసార పాలన కొనసాగిందనే విమర్శలు వినిపించాయి. రాజకీయ నాయకులు పాలకమండలి లో ఉంటే తమ సాదక బాధలను చెప్పుకోవడానికి వీలుంటుందని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

**విపరీతంగా సీట్లు పెంచడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు :**

రెండు సంవత్సరాల క్రితం వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలలో 700 లోపు సీట్లను సంవత్సరానికి భర్తీ చేసే వారు. అయితే ఆ సంఖ్య ప్రస్తుతం 2200 మందికి పెరిగింది. మూడు కొత్త కాలేజీలు వచ్చినప్పటికి సీట్ల సంఖ్య వెయ్యి లోపు ఉంటే బాగుండేది. అలా కాకుండ ఎక్కువ మొత్తంలో సీట్లు పెంచడం వల్ల విద్యార్థులకు చదువు కోవడానికి అవకాశం కల్పించినట్లు అనిపించినా, అందుకు తగ్గ సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాలు లేకపోవడంతో రాజేంద్రనగర్ లో ఉన్న పార్మర్స్ గెస్ట్ హౌజ్, బోర్లాగ్ గెస్ట్ హౌజ్, ఇంటర్నేషనల్ హాస్టల్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ గెస్ట్ హౌజ్ లన్ని విద్యార్థినీల హాస్టళ్ల కోసం కేటాయించారు. జిల్లాలలో చాలా చోట్ల వసతి గృహాలలో సరైన సౌకర్యాలు లేవు. విద్యార్థుల సీట్లు పెంచడంతో అధ్యాపకుల కొరత విపరీతం గా మారింది. విశ్వవిద్యాలయంలో పీహెచ్ఎ పూర్తి చేసిన విద్యార్థులను తీసుకుని వారికి గౌరవ వేతనం ఇస్తు పాఠాలు చెప్పిస్తున్నప్పటికీ విద్యార్థులకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో భారత వ్యవసాయ పరిశోధన మండలి ఇచ్చే అక్రిడేషన్ కూడా వస్తుందా.... రాదా.. అనే భయంలో విద్యార్థులు ఉన్నారు. సీట్లు ఎక్కువ పెంచడంతో



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఉద్యోగావకాశాలు కూడా తగ్గే ప్రమాదం ఉందని అనుకుంటున్నారు

**ఇష్టానుసారంగా బదిలీలు :**

పరి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సంవత్సర కాలంగా ఇష్టానుసారంగా అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం లో ఉండాల్సిన డిప్యూటీ రిజిస్ట్రార్ లిద్దరిని ఒకరిని వరంగల్, మరొకరిని జగిత్యాల్ కు బదిలీ చేశారు. వారిరువురివి యూనివర్శిటీ పోస్టులైనప్పటికి అటానమస్ బాడీ గా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి లో నిర్ణయం తీసుకుని వారిని బదిలీ చేశారు. రాజేంద్రనగర్ లోని మొక్కజొన్న పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేస్తు కొత్త రకాలను కనుగొంటున్న ఓ శాస్త్రవేత్తను అక్కడినుంచి బదిలీ చేసి పరి పాలన భవనంలో డైరెక్టర్ పోస్టు ఇచ్చి కూర్చొబెట్టారు. దీంతో ఆయన చేసిన పరిశోధనలు వృదా అయి పోయాయి. యూనివర్శిటీ లో ఉన్న పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ను అక్కడి నుంచి బదిలీ చేశారు. యూనివర్శిటీ ఆఫీసర్ పోస్టు అని కూడా చూడకుండ పాలకమండలి లో నిర్ణయం తీసుకుని బదిలీ చేశారు. ప్రజా సంబందాల అధికారి గా ఉన్న వ్యక్తిని రాజేంద్రనగర్ లో గల వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఐ) లో ఉన్న ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్ పబ్లిక్ రిలేషన్స్ అండ్ కమ్యూనికేషన్స్ అని క్రియేట్ చేసి అక్కడికి బదిలీ చేశారు. అడిగే వారు లేరని ఇటీవల 27 మంది నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ను బదిలీ చేయడంతో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పట్టుబట్టి 13 మందిని యదావిదిగా వారు పనిచేస్తున్న చోటనే పనిచేసేలా చూశారు.

**వర్శిటీ ఉన్నతాధికారుల క్వార్టర్స్ లో ఉన్న బయట వారిని ఖాళీ చేయించలేని అధికారులు :**

వర్శిటీ ఉన్నతాధికారుల క్వార్టర్స్ లో ఇతర శాఖలకు చెందిన అధికారులు నివాసం ఉంటున్నారు. వారిని ఖాళీ చేయాలని వర్శిటీ తరపున నోటీసులు ఇచ్చినా, వారు ఖాళీ చేయడం లేదు. యూనివర్శిటీ అధికారులు కూడా నామ్ కే వాస్తేగా ఖాళీ చేయించే ప్రక్రియ ను చేపడుతున్నారనే విమర్శలు వినిపిసు బిన్నాయి. ఇతర శాఖలకు చెందిన అధికారులు క్వార్టర్ల నుంచి ఖాళీ చేస్తే యూనివర్శిటీ అధికారులుగా ఉన్న వారు వాటిలోకి రావాల్సి ఉంటుంది. అలా వస్తే వారి వేతనాలలో ఇంటి అద్దె క్రింద రూ. 50 నుంచి రూ. 60 వేల వరకు కట్ అవుతుంది. ఇప్పటికే స్వంత ఇళ్లలలో ఉన్న అధికారులు క్వార్టర్లలోకి రావడానికి ఇష్టపడటం లేదు. దీంతో బయట వారే ఆ క్వార్టర్లలలో ఉంటున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వర్శిటీ కి పూర్తి స్థాయి పాలకమండలి ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు కోరుతున్నారు.

**రోడ్లు వేశారు.. గేట్లు మూసేశారు :**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూ. 3 కోట్లతో అంతర్గత రోడ్లు వేశారు. ఆ రోడ్లలలో వాహనాలు నడవకుండ గేట్లు ఏర్పాటు చేశారు. రోడ్లు ఎందుకు వేశారో.. గేట్లు ఎందుకు పెట్టారో అర్థం కాక ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు.

## నిబంధనల మేరకే బదిలీలు: వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిబంధనల మేరకే బదిలీలు చేస్తున్నామని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య' ప్రభాత ఉదయం' ప్రతినిధి కి వివరించారు. డిప్యూటీ రిజిస్టార్ ల పదవులను రీజినల్ ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పిఆర్ఓ, డిప్యూటీ పీఆర్ఓ పోస్టులు ఉన్నాయని, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ వేరు పడ్డప్పుడు ఒకరు ఆంధ్ర కు వెళ్లాల్సి ఉండగా ఇద్దరు తెలంగాణ వాళ్ళయినందున ఇక్కడే ఉన్నారన్నారు. అందుకే ఒకరిని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానానికి బదిలీ చేయడం జరిగిందన్నారు. అక్కడ పబ్లిక్ రిలేషన్ పని ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వర్సిటీ కి త్వరలో పూర్తిస్థాయి పాలకమండలని ఏర్పాటు చేయడం జరుగుతుందని అందుకోసం ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. వ్యవసాయ వర్సిటీ ఆఫీసర్స్ కోటర్స్ లో ఉంటున్న పోలీస్ అధికారులను ఖాళీ చేయాలని కోరుతూ ఆరు నోటీసులు ఇవ్వడం జరిగిందని అయినా వారి నుంచి స్పందన రాకపోవడంతో డీజీపీ కి లేఖ రాశామన్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, ప్రేమావతి పేట్ ప్రాంత వాసులకు వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి రాకపోకలు సాగించడానికి అనుమతులు ఉంటాయన్నారు. వారు ఆధార్ కార్డు చూపితే పంపించడం జరుగుతుందన్నారు. నార్మ్ పక్క నుంచి, ప్రేమావతిపేట మీదుగా వెటర్నరీ యూనివర్సిటీ నుంచి, భవానీ కాలనీ, బోర్లాగ్ గెస్ట్ హౌస్ నుంచి వెళ్లడానికి దారులు ఉన్నాయన్నారు.

# సముద్రాలను కాపాడటమంటే మానవాళి భవిష్యత్తును రక్షించడమే!

**విద్యానికేతన్ స్కూల్‌లో ప్రపంచ మహాసముద్ర దినోత్సవం**

**హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పి. శ్రీనివాస్ పిలుపు**

**శేరిలింగంపల్లి జూన్ 08, (ప్రభాత ఉదయం)**

ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో మహా సముద్రాల పాత్ర అత్యంత కీలకమైనదని సముద్రాలను కాపాడుకోవడం అంటే మానవాళి భవిష్యత్తును కాపాడుకోవడమేనని హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎర్త్, ఓషన్ అండ్ ఎట్మాస్ఫియర్ సైన్సెస్ విభాగపు ఆచార్యులు పి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం తారానగర్‌లోని విద్యానికేతన్ మోడల్ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మహాసముద్ర దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ రామాచారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య పి. శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనం నివసించే భూగ్రహంలో భూమి కేవలం 29 శాతం మాత్రమేనని, మిగిలిన 71 శాతం ఆక్రమించిన జలాలే జీవావరణ సమతుల్యతను, వాతావరణాన్ని నియంత్రిస్తున్నాయని తెలిపారు. మనం పీల్చే ఆక్సిజన్‌లో సింహభాగం సముద్రాల



ప్రపంచ మహాస సముద్రాల దినోత్సవం మాట్లాడుతున్న ముఖ్య అతిధులు. సమావేశానికి హాజరైన విద్యార్థులు..

నుంచే లభిస్తుందని కోట్లాది మందికి ఇవి ఆహారాన్ని, ఉపాధిని అందిస్తున్నాయని గుర్తుచేశారు. ప్రపంచ నాగరికతలన్నీ నదీ పరివాహక ప్రాంతాల్లోనే విలసిల్లాయని, నీరే అభివృద్ధికి చిహ్నమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పేరిట మానవుడు చేస్తున్న పనుల వల్ల సముద్రాలు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయని ఆచార్య శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక రసాయనాలు, చమురు లీకేజీలు, మురుగునీరు వల్ల ప్రతి ఏటా లక్షలాది సముద్ర జీవులు, అంతరించిపోతున్నాయని హెచ్చరించారు. సముద్ర జీవవ్యవస్థ దెబ్బతింటే ఆ ప్రభావం మానవాళిపైనే తీవ్రంగా ఉంటుందని, అందుకే 2030 నాటికి కనీసం 30 శాతం సముద్ర ప్రాంతాలను సంరక్షించాలని ప్రపంచ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని వివరించారు. సముద్రాల రక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, బీచ్‌ల శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనడం, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా సముద్రాలను కాపాడుకోవచ్చన్నారు. ఒక సముద్రం ఒక వాతావరణం ఒక భవిష్యత్తు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి అమ్మయ్య చౌదరి, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


# హెచ్-ఫాస్ట్,జీహెచ్ఎంసీ ఉమ్మడి దాడి

**అంతర్-రాష్ట్ర చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు..**


**90టన్నుల వ్యర్థాలు,7వాహనాలు స్వాధీనం..**

**రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం)**


ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే అంతర్-రాష్ట్ర చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను హైదరాబాద్ సిటీ పోలీస్ కింద పనిచేసే 'హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం,గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ వైద్యుల బృందం ఉమ్మడిగా దాడి చేసి రట్టు చేశాయి.నమ్మకమైన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున ఉమ్మడి బృందాలుఅంబర్‌పేట్, కుల్సుంపురా,అత్తాపూర్,రాజేంద్రనగర్ పరిధిలోని చికెన్ వ్యర్థాల రవాణా గోదాములపై ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.ఈ ఆపరేషన్‌లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 7నాలుగు చక్రాల రవాణా వాహనాలను పోలీసులు అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు.ఈ వాహనాలలో ఎలాంటి అనుమతులు లేకుండా,నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న సుమారు 90టన్నుల పచ్చి చికెన్ వ్యర్థాలను గుర్తించి సీజ్ చేశారు.పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్వాహకులు హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఉన్న వివిధ చికెన్ షాపుల నుండి ఈ వ్యర్థాలను సేకరిస్తున్నట్లు తేలింది.వాస్తవానికి నిబంధనల ప్రకారం ఈ వ్యర్థాలను చెంగిచెర్లలోని రెండరింగ్ పాయింట్‌కు



తరలించాల్సి ఉంటుంది.కానీ ఎలాంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్,అనుమతులు లేకుండా,వాణిజ్య చేపల చెరువుల్లో మేతగా ఉపయోగించడం కోసం వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం,ఏలూరు,భీమడోలు,ఉండి (పశ్చిమ గోదావరి జిల్లా) ప్రాంతాలకు,అలాగే నల్గొండలోని మాల్ టౌన్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి,కఠిన చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.స్వాధీనం చేసుకున్న సుమారు 90 టన్నుల చికెన్ వ్యర్థాలను జీహెచ్ఎంసీ వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణలో నిర్దేశిత నిబంధనల ప్రకారం సురక్షితంగా పారదోలారు.హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ సుదీర్ఘ ఆపరేషన్ జరిగింది.హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రంజిత్ కుమార్,ఎం.అంజయ్యలతో పాటు సబ్-ఇన్‌స్పెక్టర్లు,హెచ్-ఫాస్ట్ సిబ్బంది,జీహెచ్ఎంసీ వెటర్నరీ వైద్యులు ఈ దాడులలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు.పచ్చి చికెన్ వ్యర్థాలను



సేకరించడం,నిల్వ చేయడం,వాణిజ్య చేపల చెరువుల్లో వాటిని ఆహారంగా వేయడం పూర్తిగా నిషేధించబడింది.ఇటువంటి అత్యంత అపరిశుభ్రమైన పద్ధతుల వల్ల ఆహార గొలుసులోకి ప్రమాదకరమైన బయోలాజికల్ బ్యాక్టీరియా/విషపదార్థాలు ప్రవేశిస్తాయి.ఈ వ్యర్థాలను తిని పెరిగిన చేపలను తినడం వల్ల మనుషులకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఇది ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరం.కావున చికెన్ వ్యాపారులు,ప్రజలు ఎవరైనా ఇటువంటి అక్రమ నిల్వలు,వ్యర్థాల తరలింపులను గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించి ప్రజారోగ్య సంరక్షణలో భాగస్వాములు కావాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కోరుతున్నారు.




# అప్పా జంక్షన్ సమీపంలో రోడ్డు ప్రమాదం

**ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలతో మృతి..**

**రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం)**

నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు.వివరాల ప్రకారం..పోలీసుస్టేషన్ పరిధిలోని అప్పాజంక్షన్ కూడలి వద్ద వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నట్లు సమాచారం.గాయపడిన ఆటో డ్రైవర్‌ను స్థానికులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా,చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.నార్సింగి నుంచి అప్పాజంక్షన్ వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు,కారు వేగం,డ్రైవర్ నిర్లక్ష్యం వంటి అంశాలపై విచారణ కొనసాగుతోంది.మృతుడి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మహిళ ఆత్మహత్య


**రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం)**



ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. .మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయలక్ష్మి (37)కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది.గత కొంతకాలంగా ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విజయలక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు.ఆరోగ్య సమస్యల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నూతన జిల్లా మాస్ ఎడ్యుకేషన్, మీడియా అధికారిగా జి.మంజుల బాధ్యతల స్వీకరణ..

**రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం)**



రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో నూతనంగా నియమితులైన జిల్లా మాస్ ఎడ్యుకేషన్,మీడియా అధికారిగా జి.మంజుల సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య,వైద్య,కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు మహబూబ్ నగర్ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన జి.మంజుల,ఇప్పటివరకు ఈ బాధ్యతలను నిర్వహించిన కె.శ్రీనివాసులు నుండి బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది నూతన అధికారిని ఆత్మీయంగా స్వాగతించారు.ప్రజారోగ్య కార్యక్రమాల ప్రచారం,ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణ,జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమాచార వ్యాప్తి,మీడియా సమన్వయం,ప్రజలకు ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సమర్థవంతంగా చేరవేయడంలో జిల్లా మాస్ ఎడ్యుకేషన్,మీడియా అధికారి కీలక పాత్ర పోషిస్తారని అధికారులు పేర్కొన్నారు.అనంతరం జి.మంజుల మాట్లాడుతూ...జిల్లా వైద్య,ఆరోగ్య అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి మార్గదర్శకత్వంలో ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యంగా తల్లి-శిశు ఆరోగ్యం,టీకా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ,ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు,ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు,కార్యక్రమ నిర్వాహకులు,కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించిన గోల్కొండ,గోశామహెల్ ఇన్ చార్జ్ బీజేపీ ఇంచార్జ్ వై.శ్రీధర్ ఫైర్

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ఆరోపణలు సబబు కాదు..**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**

**రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం)**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కోహెడ రైతుల మార్కెట్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో మాట్లాడుతూ... కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర నిధులకు అడ్డుపడుతున్నారు,కేంద్రం నిధులు రానివ్వడం లేదని చేసిన వ్యాఖ్యాలను ఖండిస్తున్నామని గోల్కొండ,గోశామహెల్ ఇన్ చార్జ్ బీజేపీ ఇంచార్జ్ వై.శ్రీధర్ అన్నారు.ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలను సీఎం రేవంత్ రెడ్డి చేయడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ...విలేకరులతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల గురించి తెలియజేశారు.ప్రధాని మోడీ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తున్నారని గుర్తు చేశారు.గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.10వేల కోట్లు,అమృత్ 2.0 కొరకు రూ.3849 కోట్లు,నేషనల్ హైవే 167 విస్తరణ కొరకు రూ.3175 కోట్లు,పీఎం ఈ-డ్రైవ్ బస్సుల కొరకు రూ.3వేల కోట్లు,జగిత్యాల నుంచి మంచిర్యాల నేషనల్ హైవే కొరకు రూ.2731 కోట్లు,ఆర్మూర్ జిగిత్యాల నేషనల్ హైవే కోసం రూ.2472 కోట్లు,జిగిత్యాల కరీంనగర్ నేషనల్ హైవే కొరకు రూ.2395 కోట్లు,వరంగల్-కరీంనగర్ కారిడార్ కొరకు రూ.1420 కోట్లు,ఇవి కాగితాల మీద మాటలు కావు,తెలంగాణ నెల మీద మోడీకి ఉన్న ప్రగతి ముద్రలు ఇన్ని కోట్లు ఇచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రానికి వచ్చే నిధులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాకుండా చేస్తున్నారని అనడం కాదు,మీరు రెండు సంవత్సరాలు గడిచిన తెలంగాణకు చేసింది ఏమి లేదు,కానీ మా నాయకుని అనడం సబబు కాదన్నారు.మంత్రికి మేము మద్దతు తెలుపుతున్నామని,మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుల దగ్గర ఉన్న ధాన్యం కొన్నది లేదు,తెలంగాణ రాష్ట్రం అభివృది కొరకు ఆలోచన లేదు,ప్రజల కొరకు ఆలోచనలేదు,ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసింది లేదు,మీరే అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తే కానీ రాష్ట్ర ప్రభుత్వానికి పూట గడిచే పరిస్థితి లేదన్నారు.రేవంత్ మాటలు కొండలు,కోటలు దాటుతున్నాయని,చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని విమర్శించారు. తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అంటే ముస్లిం,ముస్లిం అంటే కాంగ్రెస్ అని కేంద్రం ఇచ్చిన సొమ్ముతోనే మీరు మీ ప్రభుత్వం నడుపుతున్నవా మరి మీరు చేసింది ఏముందని ఆరోపించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 08 (ప్రభాత ఉదయం):**





ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన రాజు గౌడ్ తాను డిగ్రీ, పిజిడిసిఏ, డిఈడి పూర్తి చేశానని, గతంలో కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సైదల పద్మ తన ప్రజా పాలన వివరాలను దుగ్నేపల్లి గ్రామపంచాయతీ నుండి చెన్నూరు మున్సిపాలిటీకి మార్పు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కడారి బీరయ్య తనకు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉందని, ఊరిలోని అందరి ఇళ్ళ నుండి వచ్చే మురుగునీరు తన భూమిలోకి రావడంతో వ్యవసాయ సాగు చేయలేకపోతున్నానని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సుభాష్ రోడ్ కు చెందిన జె శాంతయ్య తాను సింగరేణి ఉద్యోగం చేసి పదవి విరమణ పొందానని, తాను కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇంటిని తన పెద్ద కుమారుడు ఆక్రమించుకున్నాడని, తన చిన్న కుమారునికి సింగరేణి ఉద్యోగం కల్పించానని, ప్రస్తుతం తన కుమారులు తన, తన భార్య బాగోగులు చూడడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భూపాలపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన బుర్ర లచ్చయ్య తన తండ్రి పేరిట జైపూర్ మండలం షెట్ పల్లి గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణానంతరం కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి రాములు తనకు గతంలో 88 శాతం దివ్యాంగత్వం నిర్ధారించబడి పింఛన్ మంజూరు అయిందని, ఇప్పుడు తక్కువ శాతంతో నిర్ధారించడంతో పింఛన్ ఆగిపోయిందని, నిరుపేద అయిన తన పరిస్థితి అర్థం చేసుకొని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ ప్రాంతవాసులు తమ ప్రాంతంలోని రైల్వే గేట్ వెనక ఏర్పాటు చేస్తున్న బార్ కం రెస్టారెంట్ నివాస గృహాల మధ్యన రైల్వే ఫుడ్ ఓవర్ బ్రిడ్జికి అతి సమీపంలో ఉన్నందున అభ్యంతరాలు తెలుపుతున్నామని, బార్- రెస్టారెంట్ ఏర్పాటు నిలుపుదల చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పిడిఎస్యూ ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల పట్టిక నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కోరారు. చెన్నూరు పట్టణంలోని పద్మ నగర్ కు చెందిన తన్నీరు ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం

## ఎంపీఓ కృష్ణమోహన్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 8(ప్రభాత ఉదయం)**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామంలో ఎంపీఓ కృష్ణమోహన్, సర్పంచ్ పర్నికా కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ అమలులో బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎన్ఏ) పాత్ర కీలకమని అన్నారు. రాజకీయ పార్టీలు వెంటనే బీఎల్ఎలను నియమించి నిర్దేశిత నమూనాలో జాబితాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా పై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున పంటల మార్పిడి, నీటి పొదుపు, సమతుల్య ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శిరీష, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, జీపీఓ వెంకటపతి నాయుడు, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు



# ప్రజావాణికి 121 ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి , జూన్ 8(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 94 దరఖాస్తులు అందగా, మొత్తం 121 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

# వాల్మీకి సంఘం నాయకులు మృతి

## నివాళులర్పించిన ప్రముఖులు

**కేటిదొడ్డి, జూన్ 8(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం వాల్మీకి సంఘం అధ్యక్షుడు టీచర్ గోవిందు (65) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కర్నూల్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ బాసుహన్మంతు నాయడు, కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్, ఎంపీఓ రామన్ గౌడ్, రెవెన్యూ సిబ్బంది, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ధరూర్ శ్యాం, జిల్లా నాయకులు ఆంధ్రజ్యోతి శ్రీనివాస్, చుక్క సుదర్శన్ రెడ్డి, సాక్షి నరసింహ్మా, కేటిదొడ్డి మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, ప్రముఖులు, వాల్మీకి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు టీచర్ గోవింద్ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాడసానుభూతి తెలియజేశారు. టీచర్ గోవిందు పాడె మోసిన వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప కేటీదొడ్డి మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు, గోవిందు అకాల మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గట్టు తిమ్మప్ప తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. టీచర్ గోవిందు మరణవార్త తెలిసిన వెంటనే గట్టు తిమ్మప్ప వారి స్వగ్రామానికి చేరుకుని, భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యాన్ని నింపారు. సమాజ సేవకుడిగా, వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా మండలంలో గోవిందు గారు అందించిన సేవలు ఎనలేనివని, వారి మరణం సంఘానికి, విద్యా రంగానికి తీరని లోటని చైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గోవిందు అంతిమ యాత్రలో పాల్గొన్న చైర్మన్ గట్టు తిమ్మప్ప సాధారణ వ్యక్తిలా స్వయంగా ముందుకు వచ్చి పాడెను భుజాలపై మోసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అంతటి ఉన్నత పదవిలో ఉండి కూడా, కింది స్థాయి కార్యకర్త, సంఘం నాయకుడి అంతిమ యాత్రలో పాడె మోయడంపై స్థానిక ప్రజలు, వాల్మీకి సంఘం నేతలు ఆయన నిరాడంబరత్వాన్ని కొనియాడారు. ఈ అంతిమ యాత్రలో వాల్మీకి సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ నారాయణ నాయకులు ఉరుకుండు యుగంధర్ కొండన్న తదితరులు ఉన్నారు.

# వైన్ షాపులో చోరీకి యత్నం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 8(ప్రభాత ఉదయం)**




:గుర్తు తెలియని దుండగులు వైన్ షాపులో చోరికి యత్నించిన సంఘటన గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వైన్ షాపు నిర్వాహకులు, పోలీసుల కథనం ప్రకారం... గద్వాల పట్టణ పరిధిలోని శ్రీజములమ్మ ఆలయ సమీపంలో గల శ్రీకనకదుర్గ వైన్స్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేసేందుకు షటర్‌ను గునపాలతో లేపి చోరీకి యత్నించారు. సోమవారం ఉదయం వైన్ షాపు షెటర్ పైకి ధ్వంసమై ఉండడంతో గమనించిన నిర్వాహకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మద్యం బాటిళ్లు, నగదు ఏమి చోరీ కాలేదని నిర్వాహకులు తెలిపారు.

# మృగశిర కార్తెకు కొండెక్కిన నాటు కోళ్ల ధరలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 8(ప్రభాత ఉదయం):**





మృగశిర కార్తె సందర్భంగా నాటు కోళ్ల ధరలు కొండెక్కాయి. ప్రతి సోమవారం గద్వాలలో నిర్వహిస్తున్న వారంతపు సంతలో ఒక నాటు కోడి ధర రూ. 1,200 నుంచి రూ. 2,500 వరకు పలుకుతోంది. మృగశిర కార్తె ను పురస్కరించుకుని చేపలు, నాటుకోళ్ల వంటకాలతో భోజనం చేయడం నడిగడ్డ ప్రజల ఆనవాయితి. దీంతో తప్పని పరిస్థితుల్లో ప్రజలు ఎంత ధర ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇదే అదునుగా చేసుకున్న వ్యాపారులు అచ్చంగా నాటు కోడిలా ఉండే రెండో రకం కోడిని కూడా అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒరిజనల్ నాటు కోడిని పోలి ఉన్న రెండో రకం కోడి వెయ్యి రూపాయల లోపే విక్రయించాల్సి ఉన్నప్పటికీ నాటు కోడే అని చెప్పి ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. రెండు రకాల కోళ్లు ఒకేలా ఉండడంతో ప్రజలు పోటి పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఒరిజనల్ నాటు కోడి కాళ్లు నల్లగాను, ముక్కు సూదిగాను ఉంటుందని రెండోరకం కోడి కాళ్లు మాత్రం పసుపు రంగులో ఉంటాయని నాటు కోళ్ల పెంపకం దారులు చెబుతున్నారు. వాటిలో తేడా తెలియక ప్రజలు మోసపోతున్నట్లు తెలిపారు.



# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 08 (ప్రభాత ఉదయం):**



ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఆర్డీఓగా డి శ్రీధర్

**రాజేంద్రనగర్, జూన్ 8(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ ఆర్డిఓ గా డీ శ్రీధర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఆర్డిఓ వెంకట్ రెడ్డి పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. హైదరాబాద్ కలెక్టరేట్లో లా ఆఫీసర్ గా పని చేస్తున్న డి శ్రీధర్ బదిలీపై రాజేంద్రనగర్ ఆర్డిఓ గా వచ్చారు. ఈ సందర్భంగా డి శ్రీధర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు పనిచేస్తారన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలు సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు.




# విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 8(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్) ప్రిన్సిపాల్ వీరన్న ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించబడుతుందన్నారు. అలాగే విద్యార్థులకు స్కాలర్షిప్స్, ఉచిత పాఠ్యపుస్తకాలు, బస్సు పాసులు, హాస్టల్లో సీట్లు అన్ని సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వం తరపున కల్పించబడుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆయన విద్యార్థులను కోరారు.

# ప్రాచీన యుద్ధవిద్యలకు పునర్జీవం..కళలను కాపాడుకోవాలి..

## ద్వారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కర్రసాము శిక్షణను అభినందనీయం..

## రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**కిస్మత్‌పూర్,జూన్08(ప్రభాత ఉదయం)**






కర్రసాము వంటి సాంప్రదాయ యుద్ధ కళలను ‘ద్వారా ఫౌండేషన్’ఆధ్వర్యంలో ప్రోత్సహించడం అభినందనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ‘ద్వారా ఫౌండేషన్’ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కర్రసాము శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన సమారోప్ ఉత్సవ్ కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి జీఎంసీ ట్రస్ట్ చైర్మన్ గోకారి అర్జున్ గౌడ్,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యుల డాక్టర్ అన్నదానం వెంకట సుబ్రహ్మణ్యంలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ,స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న కర్ర, కత్తిసాము లాంటి ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వ్యాయామ క్రీడలు నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగడం ఖాయమని,అంతేకాకుండా గ్రహణ శక్తి,మనోధైర్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. ఇందుకు నీరుడు పవన్ సాయి చూపుతున్న చొరవ ప్రత్యేకంగా అభినందించి,ప్రశంసించారు.